ఆక్రమణకు కన్నేసి.. అదను చూసి దున్నేసి!

ప్రభుత్వ భూములను కాపాడుకోవడం రానురాను గగనంగా మారుతోంది. ఆ భూములపై ఎప్పుడు ఎవరి కన్ను పడుతుంతో చెప్పలేం. ప్రతి పరిస్థితిని అనుకూలంగా మార్చుకొని కొందరు చెలరేగిపోతున్నారు. కదిరి రెవెన్యూ గ్రామం పరిధి దేవరచెరువు పాత మరవ అన్యాక్రాంతం అందుకు ఉదాహరణ. ఇక్కడి ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్నుపడింది. సర్వేనంబరు 159-2లో 3.34 ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించిన అధికారులు మూడేళ్ల కిందట బోర్డును ఏర్పాటు చేశారు. 3.34 ఎకరాలున్నా ఈ భూమిపై కన్నేసిన ఓ వ్యక్తి బోర్డును అక్కడి నుంచి తొలగించేశారు. అప్పుడు పనిచేసిన అధికారులు బదిలీపై వెళ్లడం, ప్రస్తుతం రెవెన్యూ అధికారులు సర్ ప్రక్రియలో బిజీగా ఉండటాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. ఇందులోని 15 సెంట్లను ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాడు. ట్రాక్టర్‌తో దుక్కిచేసి పంట పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. బాహ్యవలయ రహదారికి ఆనుకుని సెంటు స్థలం రూ.3 లక్షలకు పైగా పలుకుతోంది. ఈ భూమిలో పంటలు వేసుకుంటే సాగు పేరుతో భూమిని సొంతం చేసుకోవచ్చన్న దురాశతో దుక్కి చేస్తుండటం వివాదాస్పద అంశంగా మారింది. ఈ విషయాన్ని కదిరి తహసీల్దార్ రెడ్డిశేఖర్ దృష్టికి తీసుకెళ్లగా కబ్జా వ్యవహారంపై నివేదిక ఇవ్వాల్సిందిగా వీఆర్వోకు సూచిస్తామన్నారు. కారకుడిపై చర్యలు తీసుకుంటామని వివరించారు.


ప్రభుత్వ భూమిని దుక్కిచేస్తున్న వ్యక్తులు

- న్యూస్‌టుడే, కదిరి పట్టణం



గురురాఘవుడికి ఆరాధనపూజ

మంత్రాలయ రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. ధర్మవరం పట్టణంలోని ఆలయంలో స్వామి వారిని అలంకరించి రోజంతా పూజలు చేశారు.

- న్యూస్‌టుడే, ధర్మవరం


నేడు రెవెన్యూ భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా రెవెన్యూ భవన్ (ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్)లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని రెవెన్యూ భవన్‌లోపాటు మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తారని, వాటిని కూడా పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన అర్జీలుగానే పరిగణించి పరిష్కారిస్తామన్నారు. మరింత సమాచారం తెలుసుకునేందుకు కాల్ సెంటర్ 1100కు సంప్రదించవచ్చన్నారు. ఫిర్యాదుదారుడు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా సమస్యల పరిష్కారాలపై అభిప్రాయాలను తెలుపవచ్చన్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

నీట్ పీజీ పరీక్ష కేంద్రం తనిఖీ

పుట్టపర్తి: పుట్టపర్తిలోని సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పీజీ కంప్యూటర్ ఆధారిత పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తనిఖీ చేశారు. ఆదివారం కళాశాలలో ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు నిర్వహించిన పరీక్ష వంద మందికి 96 మంది హాజరయ్యారు. భద్రత ఏర్పాట్లు, అభ్యర్థుల తనిఖీ ప్రక్రియ, కంప్యూటర్ సిస్టమ్‌లు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, పోలీసు బందోబస్తును కలెక్టర్ పరిశీలించారు.


తనిఖీ చేసి బయటకు వస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

అన్నీ లెక్కలే..
రోగులకు తిండితిప్పలే!
■ ఆసుపత్రుల్లో మెనూ అమలుపై పట్టింపేదీ?

ప్రభుత్వాసుపత్రుల్లో ఇన్‌పేషెంట్లుగా చేరుతున్న రోగులకు డైట్ పథకం ప్రకారం కూర, సాంబారు, పెరుగుతో మధ్యాహ్నభోజనం పెట్టాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ఆసుపత్రులు, పురపాలకల్లోని ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఇది సక్రమంగా పాటించడం లేదు. సాధారణ రోగులకు రూ.80, ఆరోగ్యశ్రీ రోగులకు రూ.100, బాలింతలకు రూ.100 చొప్పున భోజనానికి ఖర్చు చేయాల్సి ఉంది. చాలా చోట్ల గుత్తేదారులు ఆసక్తి చూపక ఇప్పటికీ భోజన పథకం కార్యరూపం దాల్చలేదు.

పర్యవేక్షణ పెంచుతాం

ఆహార పదార్థాలు నాణ్యతగా పెడుతున్నాం. మెనూ అమలుపై పర్యవేక్షణ పెంచుతాం. పరిమాణం తక్కువగా పెడుతున్నారన్న విషయం దృష్టికి వచ్చింది. గుత్తేదారులతో మాట్లాడి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ మల్లీశ్వరి, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల
- డేవిడ్ సెల్వరాజ్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి

తక్కువ పరిమాణంలో..


తక్కువ మోతాదులో రసం

అనంతపురం (వైద్యం): సగటున రోజుకు 600 నుంచి 1200 మంది వరకూ ఇన్‌పేషెంట్లు ఉన్న సర్వజన ఆసుపత్రిలో రోగులకు అందాల్సిన పరిమాణం కంటే తక్కువగా ఆహార పదార్థాలను (గుడ్లు, అరటిపండ్లు) ఇస్తున్నారు. పప్పు, రసం, సాంబారు వంటివి తక్కువ మోతాదులో వండి అందరికీ సర్దుబాటు చేస్తున్నారన్న విమర్శ ఉంది.

పప్పుతో సరిపెట్టేస్తూ..

కదిరి పట్టణం: 100 పడకలున్న ప్రాంతీయ వైద్యశాలలో సగటున 70 మందికి మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. చాలాసార్లు మెనూ పాటించకుండా పప్పుతోనే సరిపెట్టేస్తున్నారు. కూర, సాంబారు ఇవ్వడం లేదు. పెరుగుకు బదులుగా మజ్జిగను ఇస్తున్నారు.


కదిరి ఆసుపత్రిలో భోజనం పంపిణీ

గిట్టుబాటు కాదని..

గుత్తి: గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి గుత్తి, గుంతకల్లు గ్రామీణం, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి రోజుకు సగటున 350 మందికి పైనే వస్తున్నారు. ఇన్‌పేషెంట్లకు పడకలు కేటాయించలేదు. డైట్ పథకం నిర్వహణకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు.


గుత్తి ప్రభుత్వాసుపత్రిలో ఖాళీగా పరుపులు

బయటి నుంచి భోజనం


ఉరవకొండ సీహెచ్‌సీలో బయటి నుంచి భోజనం తెచ్చుకొని..

తనకల్లు, ఉరవకొండ, సీకేపల్లి: గుత్తేదారులు ముందుకు రాక పథకం అమలు చేయడం లేదు. తనకల్లులో రోగులు బయట హోటళ్ల నుంచి భోజనం తెచ్చుకుంటున్నారు. ఉరవకొండలో 50 పడకల ఆసుపత్రిలో భోజనం పథకం అమలు చేయాలని కోరుతున్నారు. చెన్నేకొత్తపల్లిలోనూ ఇదే పరిస్థితి. హిందూపురంలో భవన సౌకర్యం లేక పథకం అమలు చేయడం లేదు.


కారుణ్యంలో కాసులకు కక్కుర్తి

■ జడ్పీలో గుట్టుగా వసూళ్లు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తులో కారుణ్య నియామకాల్లో పలువురు ఉద్యోగులు, గుత్తేదారులతో కుమ్మక్కై వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఉద్యోగం ఎలాగైనా వస్తుంది... కోరుకున్న చోటుకు నియామకం పొందాలంటే కచ్చితంగా చేయి తడపాల్సిందేనంటూ డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం రాత్రి కూడా జడ్పీ కార్యాలయంలో మంతనాలు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. కరోనా, అనారోగ్య సమస్యలు, ప్రమాదాల్లో చాలామంది ఉద్యోగులు మరణించారు. మృతుల్లో జడ్పీ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర ఉద్యోగులు ఎక్కువ మంది ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల్లో ఒకరికి సీనియారిటీ ప్రకారం ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. ఇందులో భాగంగా జడ్పీలో మొత్తం 59 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ఇందుకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో చకచకా దస్త్రాలు సిద్ధం చేశారు. 24 మంది జూనియర్ సహాయకులు, 24 మంది టైపిస్టులు, 11 మంది ఆఫీస్ సబార్డినేటర్ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు. వీరందరికీ సోమవారం నియామక పత్రాలు అందజేయాలని నిర్ణయించారు.

ఫోన్లలో బేరసారాలు

ఉద్యోగం పొందనున్న వారికి గుత్తేదారులు ఫోన్లు చేసి బేరసారాలు కుదుర్చుకున్నారు. ఒక్కొక్కరితో రూ.లక్ష వరకు డిమాండ్ చేసినట్లు బాధితులు చెబుతున్నారు. ఇప్పటికే అనేక మంది పోస్టింగ్‌ల కోసం డబ్బులు సమర్పించుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై జడ్పీ సీఈఓ విజయలక్ష్మి వివరణ కోరగా.. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి నియామక పత్రాలు అందజేస్తామన్నారు. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.


వధూవరులు శివరాజ్, విద్యలతో సీఎం చంద్రబాబు. చిత్రంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు నాగరాజు దంపతులు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తదితరులు

వధూవరులకు చంద్రన్న ఆశీర్వాదం

ఈనాడు, అనంతపురం: గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె విద్య, తెదేపా అనంతపురం జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు కుమారుడు శివరాజ్‌ల వివాహం ఆదివారం నగరంలో ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు రాకతో తమ్ముళ్ల కోలాహలం నెలకొంది. ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలంతా ఆయనకు స్వాగతం పలికారు.

రైల్వే సీనియర్ డీసీఎం బాధ్యతల స్వీకరణ


సత్యనారాయణ

గుంతకల్లు, న్యూస్‌టుడే: ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని గుంతకల్లు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం కె.సత్యనారాయణ తెలిపారు. ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు డీసీఎంగా పనిచేస్తున్న మనోజ్ వారం రోజుల క్రితం కర్ణాటక మండలం నియంత్రణ విజిలెన్స్ అధికారిగా డిప్యుటేషన్‌పై వెళ్లిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆయన స్థానంలో తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టరుగా ఉన్న సత్యనారాయణ నియమితులయ్యారు. గుంతకల్లు డివిజన్‌లో టికెట్లు లేకుండా రైళ్లలో ప్రయాణించే వారిని నిరోధిస్తామని చెప్పారు. వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తోడ్పాటుతో ముందుకు సాగుతామని వెల్లడించారు.

కూతకెళ్లి.. పతకాలు పట్టి

జాతీయస్థాయిలో యువతుల రాణింపు

కూతకెళ్లి పాయింట్లు.. పట్టుతో పతకాలు కొల్లగొట్టారు మన కబడ్డీ వనితలు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో అద్భుత ఆటతీరుతో అందరిని మెప్పిస్తున్నారు. చిన్ననాటి నుంచే శిక్షణ తీసుకుంటూ విజయాలు సాధిస్తున్నారు. శిక్షకుడు లక్ష్మీనరసింహ తన సొంత ఖర్చులతో వారిని మ్యాచ్‌లకు తీసుకెళుతూ ప్రోత్సహిస్తున్నారు. తమ విజయాలు వారి మాటల్లోనే తెలుసుకుందాం రండి... -న్యూస్‌టుడే, తాడిపత్రి

పాయింట్ వచ్చే వరకు వదలను



మాది తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి. అమ్మానాన్నలు గంగరాజు, తులసి. నాన్న కూలి పనులు చేసుకుంటూ నన్ను పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిస్తున్నారు. నాకు ఇష్టమైన కబడ్డీలో ఎనిమిదేళ్లుగా శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటివరకు ఏడు జాతీయ స్థాయి పోటీల్లో తలపడ్డా. యూనివర్సిటీ స్థాయిలో చెన్నైలో జరిగిన సౌత్‌జోన్, ఈ నెల 28న తిరుపతిలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడి జట్టు విజేతగా నిలవడంలో కీలకపాత్ర పోషించా. పాయింట్లు తెచ్చుకునే వరకు కూత వదలకపోవడమే నా ప్రత్యేకత. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో 35 పతకాలు వచ్చాయి. జాతీయ జట్టులో చోటు సంపాదించి అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలన్నదే నా లక్ష్యం. **-గౌతమి, డిగ్రీ ద్వితీయ సంవత్సరం**

జాతీయ జట్టులో స్థానమే లక్ష్యం



తాడిపత్రిలోని పడమటి గేరిలో ఉంటున్నాం. అమ్మానాన్నలు ఖాదర్ బాషా, హాజీరా. నాన్న వెల్డింగ్ పనిచేస్తూ నన్ను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిస్తున్నారు. ఆరేళ్లుగా కబడ్డీలో శిక్షణ తీసుకుంటున్నా. ఇప్పటివరకు విజయవాడ, కర్నూలు, అనంతపురం, తిరుపతిలో నిర్వహించిన ఏడు రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడ్డా. గతేడాది క్రీడ సంఘం ఆధ్వర్యంలో హరియాణాలో జరిగిన జాతీయ పోటీలో పాల్గొన్నా. ఈ నెల 28న తిరుపతిలో జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్‌లో జట్టు మొదటి స్థానంలో నిలవడంతో ప్రధాన పాత్ర పోషించడం ఆనందంగా ఉంది. జాతీయ జట్టులో చోటు సంపాదించి అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలన్నదే నా ధ్యేయం. **-సుహానా, డిగ్రీ ప్రథమ ఏడాది**

అధినేత రాకతో అనంతలో సందడి

ఈనాడు, అనంతపురం; రాంనగర్, న్యూస్‌టుడే: అనంతపురంలో ఆదివారం వివాహ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబును ఉమ్మడి జిల్లా తెదేపా నేతలు స్వాగతం పలికారు. మంత్రులు పయ్యావుల కేశవ్, టీజీ భరత్, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరారెడ్డి, కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి ప్రసాద్, కందికుంట వెంకటప్రసాద్, ఎం.ఎస్.రాజు, జేసీ అస్మిత్‌రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యేలు ప్రభాకర్ చౌదరి, జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఏడీసీసీ ఛైర్మన్ కేశవరెడ్డి తదితరులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.


వివాహ వేడుకలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

గంటలోనే ముగిసిన సీఎం పర్యటన

మధ్యాహ్నం 2.25కు శిల్పారామం వద్ద హెలిప్యాడ్‌కు చేరుకున్న చంద్రబాబు పార్టీ నేతలు, అధికారులను పలకరించాక నేరుగా బళ్లారి రోడ్డులోని ఎంజైఆర్ కల్యాణ మండపానికి చేరుకున్నారు. వధూవరులను ఆశీర్వదించారు. 3 నుంచి 3.10 వరకు కల్యాణ మండపంలో ఉన్న సీఎం తిరిగి హెలిప్యాడ్‌కు చేరుకుని 3.30కు బయలుదేరి వెళ్లారు.

● హెలిప్యాడ్ వద్ద సీఎంకు స్వాగతం పలికేందుకు వచ్చిన సందర్భంలో మాజీ ఎమ్మెల్యేలు జేసీ ప్రభాకర్‌రెడ్డి, వైకుంఠం ప్రభాకర్‌చౌదరి కాసేపు ముచ్చటించుకున్నారు.

డిసెంబరుకు అన్ని ప్రాంతాల్లో విద్యుత్తు బస్సులు


పరిశీలిస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకొండ్ల నారాయణ

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు పనులు వేగంగా సాగుతున్నాయని డిసెంబరుకు అన్ని ప్రాంతాల్లో విద్యుత్తు బస్సులు ప్రారంభమవుతాయని ఆర్టీసీ ఛైర్మన్ కొనకొండ్ల నారాయణరావు పేర్కొన్నారు. ఆదివారం అనంతపురంలోని ఆర్టీసీ డిపోలో విద్యుత్తు బస్సుల రాకకు సాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతపురంలో డిసెంబరుకు పనులన్నీ పూర్తవుతాయని ఆయన వివరించారు. కొన్ని ప్రాంతాల్లో అక్టోబరు చివరికి 350 బస్సులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 1050 విద్యుత్తు బస్సులు వస్తున్నాయని పేర్కొన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ప్రభుత్వంపై రూ.3 వేల కోట్లకు పైగా భారం పడినా ఎక్కడా వెనుకంజ వేయకుండా కొనసాగిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో కొంత సమస్య ఉన్నా ఎలక్ట్రిక్ బస్సుల రాకతో తీరిపోతుందన్నారు. కార్యక్రమంలో ఈడీఏ రవివర్మ, కడప జోన్ ఈడీ శ్రీకృష్ణ కిషోర్, జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీలక్ష్మి, డిప్యూటీ సీటీఎం ప్రశాంతి, డిపో మెనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన మూడురోజుల మ్యాచ్

అర్జున్ తెండూల్కర్ శతకం వృథా


అర్జున్ తెండూల్కర్ (100 పరుగులు, 3 వికెట్లు)


కృష్ణతేజారెడ్డి (132)

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఓపెనర్ అర్జున్ తెండూల్కర్ (100 పరుగులు, 3 వికెట్లు) ఆల్‌రౌండ్ ప్రతిభను ప్రదర్శించినా. సౌత్‌జోన్ అండర్-23 అంతర్ జిల్లా క్రికెట్ పోటీలో చిత్తూరు జట్టు అనంతపురం జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 94 పరుగుల ఆధిక్యత సాధించింది. అనంత క్రికెట్ మైదానంలో ఆదివారం ఓవర్‌నైట్ స్కోర్ 342/5తో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన చిత్తూరు జట్టు ఏజీ కృష్ణతేజారెడ్డి (132), పి.భవానీ ప్రసాద్ (73)లు అద్భుతమైన బ్యాటింగ్ చేయడంతో 130.4 ఓవర్లలో 531 పరుగులకు ఆలౌటైంది. అనంత బౌలర్లు పి.అర్జున్ తెండూల్కర్, టి.ప్రదీప్‌రెడ్డి చెరో మూడు వికెట్లు తీసి బ్యాటర్ల జోరుకు కళ్లెం వేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు అర్జున్ తెండూల్కర్ (100) అజేయ శతకం, కెప్టెన్ వీరారెడ్డి (64), జయంత్‌కృష్ణ (54)లు వీర విహారం చేయడంతో 36.3 ఓవర్లలో 4 వికెట్లకు 254 పరుగులు చేసింది. ముగ్గురు బ్యాటర్లు టీ20 తరహాలో బ్యాటింగ్ చేయడంతో తక్కువ ఓవర్లలోనే స్కోరు నమోదైంది. చిత్తూరు జట్టుకు రెండో ఇన్నింగ్స్ ఆడే అవకాశం లేకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ పోటీలకు సోమవారం విరామం. మంగళవారం నుంచి నాలుగో రౌండ్ పోటీలు ప్రారంభమవుతాయని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి టి.శ్రీధర్ తెలిపారు.

రవి ఆశయాలు కొనసాగిస్తాం

రామగిరి, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, పరిటాల రవీంద్ర ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపారని, ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం పనిచేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం తెదేపా సమన్వయకర్త పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. పరిటాల రవీంద్ర జయంతి ఆదివారం వెంకటాపురంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పరిటాల రవీంద్ర ఘాట్‌కు ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్‌లు కుటుంబ సభ్యులతో కలిసి నివాళులు అర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పరిటాల అభిమానులు, తెదేపా శ్రేణులు ఘాట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్‌లు మాట్లాడుతూ పేరూరు జలాశయానికి నీటిని తీసుకురావడం పరిటాల రవీంద్ర కల అని, అది త్వరలోనే నెరవేర్చనున్నట్లు వెల్లడించారు. రవి ఆశయసాధన కోసం శ్రీరామ్ ప్రతినిత్యం పనిచేస్తారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో పరిటాల సిద్ధార్థ, తెదేపా నాయకులు బాలాజీ, రామ్మూర్తినాయుడు, సుధాకర్, శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

ఆలయ సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేటి (సోమవారం) ఉదయం 6 గంటల నుంచి 6.45 గంటల వరకు స్వామివారి దర్శనం కల్పిస్తారు. శ్రీవారికి 7 గంటల నుంచి 9 గంటల వరకు అభిషేక, స్వర్ణకవచ సేవలు. 10.30 గంటలకు ఆలయంలో స్వామివారికి ఆర్జిత కల్యాణం. 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వదర్శనం ఉంటుంది.

ప్రైవేట్ రంగ సంస్థల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రైవేట్ రంగ సంస్థల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రైవేటు రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఆగిరిపల్లిలోని మంగళపూడి నాగేశ్వరరావు భవన్‌లో సామాజిక శాస్త్రవేత్తల సదస్సును ఆదివారం నిర్వహించారు. సోషలిస్టు కూటమి జాతీయ కార్యదర్శి ఎల్.జె.బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రైవేట్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతన చట్టం బిల్లు పార్లమెంట్‌లో పెట్టాలని, విద్యా సంస్థల్లో విద్యార్థి ఎన్నికలు తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.నాగేశ్వరరావు, ఎల్.సాధు సుందర్‌సింగ్, వంగా రవికుమార్, కడప, కర్నూలు, అనంతపురం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పంట కాలువలకు నీరు ఇవ్వలేదు

హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: హెచ్చెల్సీ, జీబీసీ కింద ఉన్న పంట కాలువలకు (డిస్ట్రిబ్యూటరీ) నీరు విడుదల చేయలేదని హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు పేర్కొన్నారు. కేవలం తాగునీటికి మాత్రమే నీరు ఇస్తున్నామని వెల్లడించారు. శనివారం రాత్రి పంట కాలువలకు నీరు విడుదల చేశారంటూ కొన్ని సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. రైతులు, ప్రజలను పక్కదారి పట్టించేలా దుష్ప్రచారం చేసే వారిపై పోలీసు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నీటి లీకేజీలను ఎప్పటికప్పుడు అరికడుతున్నాం. నీటి సరఫరా విషయంలో రాజకీయ కుట్రలు చేస్తున్న వైనాన్ని రైతులు గుర్తించాలన్నారు. ఏ విషయమైనా ముందస్తుగా ప్రకటిస్తామన్నారు.

వేదోక్తంగా అన్నాభిషేకం


అన్నాభిషేకంలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ఆదివారం విశేష పూజలు చేశారు. శ్రావణ మాసం మూడో ఆదివారం సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మంజునాథ స్వామి వారికి వేదోక్తంగా అన్నాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారికి అర్చన, మహానైవేద్యం అనంతరం పల్లకీసేవ, స్వర్ణకవచ సేవ, రథోత్సవం చేశారు. యాగమండపంలో నిర్వహించిన రాహుకేత, కుజదోష, సర్పదోష, కాలసర్పదోష హోమాల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సజావుగా నీట్ పీజీ పరీక్ష

98.77% మంది హాజరు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: వైద్య విద్యలో పోస్టు గ్రాడ్యుయేషన్(పీజీ) ప్రవేశానికి జరిగిన ప్రతిష్ఠాత్మక నీట్ పరీక్ష సజావుగా ముగిసింది. ఆదివారం అనంతపురం, తాడిపత్రిలోని ఐదు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం 979 మంది ఎంబీబీఎస్ వైద్యులు హాజరు కావాల్సి ఉండగా.. 967 మంది పరీక్ష రాశారు. 98.77 శాతం హాజరు నమోదైంది. 12 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా ఏ సమస్య తలెత్తకుండా ప్రశాంతంగా ముగియడంతో జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. అనంత శివారులోని ఎస్ఆర్ఐటీ, అనంత లక్ష్మి, చిన్మయనగర్‌లోని జాతీయ కౌన్సిల్ ఫర్ చర్చ్, తాడిపత్రిలోని సీవీ రామన్, తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలల్లో నీట్ పీజీ పరీక్ష జరిగింది. కలెక్టర్ ఆనంద్ ఎప్పటికప్పుడు పరీక్ష నిర్వహణ తీరును పర్యవేక్షించారు.

మిరపకు తెగులు.. రైతు కుదేలు



ఎల్‌నినో ప్రభావం.. పంటలు ఓ వైపు వాడిపోతుంటే మరోవైపు పంటలకు తెగులు సోకుతుంది. పంటలో పెంపకం లేకపోవడమో లేదా చనిపోవడం జరుగుతుంది. ఈ క్రమంలోనే విడపనకల్లు మండలం ఎన్.తిమ్మాపురానికి చెందిన రైతు గోవిందు తన మిరప పంటను ఆదివారం ట్రాక్టర్‌తో తొలగించారు. 4 ఎకరాల్లో మిరపను సాగు చేయగా 40 రోజుల్లోనే పంటకు ఆకులు ముడత, వేర్లు నల్లగా మారడం వంటి తెగుళ్లు సోకాయి. దాదాపుగా రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని వాపోయారు. ఓ పక్క అధికారులు సాగుకు నీరు ఇవ్వలేమని చెప్తుంటే.. మరోపక్క భూగర్భ జలాలు అడుగంటుతుంటే రైతన్నలకి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. **- న్యూస్‌టుడే, విడపనకల్లు**

'హామ్'తో అభివృద్ధి పరుగులు

నగర, పురపాలికల్లో మెరుగుపడనున్న సౌకర్యాలు

అనంతపురం(అశోక్‌నగర్), న్యూస్‌టుడే: అనంతపురం నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సరికొత్త విధానం అమలు చేయబోతున్నారు. నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ విధానం వల్ల రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి వ్యవస్థ, విభాగినులు, ఉద్యానవనాలు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ మెరుగు పడనుంది. పురపాలికలకు సొంత భవనాలు నిర్మించుకోవడానికి నిధులు ఇస్తారు. హైబ్రీడ్ యాన్యుటీ మోడల్ (హామ్) విధానంలో నిధుల మంజూరుకు సంబంధించి ఉత్తర్వులు విడుదల చేశారు.

కన్సల్టెన్సీలతో గుర్తించి అంచనా

ఒక్కో ప్రాంతంలో ఒక కన్సల్టెన్సీ ద్వారా అత్యవసర సమస్యలను గుర్తిస్తారు. ఏ పనికి ఎంత అవసరమో సదరు సంస్థలే నివేదిస్తాయి. ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించే ప్రక్రియను పూర్తి చేసి కమిషనర్ల ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్నారు. ఒకట్రెండు రోజుల్లో టెండర్లు పూర్తి చేయడానికి కసరత్తు చేస్తున్నారు.

అమలు ఇలా..

నగర, పురపాలికల్లో పనులను ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, ఏజెన్సీల ద్వారా చేపట్టడాన్ని 'హామ్'గా నిర్ణయించారు. ప్రాజెక్టుకు అవసరమైన నిధులను మొదట 40 శాతం ప్రభుత్వం భరిస్తుంది. 60 శాతం టెండరు దక్కించుకున్న సంస్థ ద్వారా చేస్తారు. వాయిదాల పద్ధతుల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన విధి విధానాలకు ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదం లభించింది. ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న చిన్న పురపాలికల్లో అభివృద్ధి పనులు చేయడానికి ఉపయుక్తంగా ఉంటుంది.

● హామ్ నిధులతో అనంతపురం జిల్లాలో రూ.174 కోట్లతో, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.133 కోట్లతో పనులు చేపట్టనున్నారు.

● అనంతపురం నగరంలో 27600 మీటర్ల సిమెంటు రోడ్డు, 1250 మీటర్ల తారు రోడ్డు, 1050 మీటర్ల డివైడర్లు, 1050 సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టనున్నారు.

● గుత్తిలో రూ.3.30 కోట్లు, పుట్టపర్తిలో రూ.3.50 కోట్లతో పురపాలక కార్యాలయాల నిర్మాణాలకు ప్రతిపాదించారు.

ప్రాంతం	నిధులు రూ.కోట్లలో
అనంతపురం	50
గుంతకల్లు	39
తాడిపత్రి	39
రాయదుర్గం	36
గుత్తి	18
కళ్యాణదుర్గం	19
హిందూపురం	14
ధర్మవరం	45
కదిరి	29
పుట్టపర్తి	17
మడకశిర	12
పెనుకొండ	16

కాటికోటేశ్వరుడికి విశేష పూజలు



తాడిమర్రి, న్యూస్‌టుడే: మండలం పరిధి చిల్లవారిపల్లి గ్రామ సమీపంలో కాటికోటేశ్వర క్షేత్రంలో ఆదివారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మూల విరాట్‌కు ఘనంగా పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తాకిడి ఎక్కువగా ఉండటంతో దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లను చేశారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

పరిగి: మండల పరిధిలోని పెద్దరెడ్డిపల్లిలో డీఎన్ ఆదినారాయణ ఇంటి తాళాలు పగుల గొట్టి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన ముగ్గురు నిందితులను ఆదివారం అరెస్టు చేసినట్లు పెనుకొండ సీఐ రాఘవన్, పరిగి ఎస్సై రవికుమార్ తెలిపారు. మండల పరిధిలోని పెద్దరెడ్డిపల్లిలోని నరసింహమూర్తి, ఉప్పర సురేష్, తదితరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 111 గ్రాములు బంగారు ఆభరణాలు, 6 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగిలిన చోరీ సొత్తు గురించి దర్యాప్తు కొనసాగిస్తున్నామని సీఐ తెలిపారు.

నలుగురిపై హత్యాయత్నం కేసు

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో శనివారం రాత్రి ఉరవకొండ మండలం పెద్ద ముష్టూరు గ్రామానికి చెందిన చరణ్‌పై వేట కొడవళ్లతో దాడి జరిగిన ఘటనలో నలుగురిపై హత్యాయత్నం కేసును నమోదు చేసినట్లు ఎస్సై నబిరసూల్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు. ముష్టూరు గ్రామానికి చెందిన చరణ్ అదే గ్రామానికి చెందిన ఓ యువతితో ప్రేమ వ్యవహారం సాగించడంతో ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. దీనిపై పోలీసులు రాజీ చేశారు. యువకుడు శ్రీధరఘట్ట గ్రామంలో బంధువుల ఇంట్లో తలదాచుకొని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడంతో ప్రత్యర్థులు వేటకొడవళ్లతో దాడి చేశారు. మునీంద్ర, నారయణస్వామి, వన్నూరుస్వామి, ప్రసాద్‌పై హత్యయత్నం కేసును నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఘటన స్థలాన్ని పరిశీలించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

వ్యసనాలకు బానిసై ఆత్మహత్య

పామిడి: పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఉంటున్న యువకుడు భాస్కర్(33) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వ్యసనాలకు బానిసైన భాస్కర్ ప్రవర్తన నచ్చక ఏడాది క్రితం ఆయన భార్య పుట్టింటికి వెళ్లింది. ఆమె కాపురానికి రాకపోవడం, తన వ్యసనాలు మానుకోలేక పోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఇంట్లో ఇనుప కొక్కికి ఉరేసుకొని చనిపోయాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

యువకుడి దారుణ హత్య

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నగర శివారులో శనివారం అర్ధరాత్రి ఓ యువకుడిని నలుగురు వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఘటనకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. అనంత గ్రామీణం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని తపోవనం ప్రాంతానికి చెందిన మఠం సోమశేఖర్ చిన్న కుమారుడు భరద్వాజ్ (33) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. అతను అవివాహితుడు. అతనికి నగరంలోని ఓ టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలితో పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం ఆమె భర్త శ్రీహరికి తెలియడంతో పలుమార్లు భరద్వాజ్‌ను హెచ్చరించాడు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ ఏడాది మార్చిలో అతను సదరు మహిళను తీసుకెళ్లడంతో వన్‌టౌన్‌లో కిడ్నాప్ కేసు నమోదై జైలుకెళ్లొచ్చాడు. ఈ నేపథ్యంలో హత్యకు గురయ్యాడు.


మఠం భరద్వాజ్

మహిళతో ఫోన్ చేయించి

భార్యతో భరద్వాజ్ వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంతో భర్త శ్రీహరి రగిలిపోయాడు. ఎలాగైనా హతమార్చాలని వ్యూహం పన్నాడు. శనివారం రాత్రి భార్య ఫోన్ నుంచి భరద్వాజ్‌కు ఫోన్ చేయించి బళ్లారి రోడ్డులోని ఆరాధ్య హోమ్స్ ప్రాంతంలోని నిర్జన ప్రదేశంలోకి రావాలని పిలిపించారు. కారులో అక్కడికి చేరుకున్న భరద్వాజ్‌ను అనుసరిస్తూ వచ్చిన శ్రీహరి, అతని బంధువులు అనిల్, కుమార్, రామాంజిలు ఒక్కసారిగా కొడవళ్లు, రాళ్లతో అతడిపై దాడి చేశారు. దాడిలో అతని కుడిచేయి తెగిపడింది. తీవ్రగాయాలై రక్తపు మడుగులో పడి కొట్టుమిట్టాడుతుండగా, నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు గమనించి అనంత రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అర్బన్ డీఎస్పీ చంద్రశేఖర్, సీఐ శ్రీకాంత్, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని తీవ్రంగా గాయపడిన భరద్వాజ్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడు ప్రత్యేక బృందాలతో హంతకుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు.

హంద్రీనీవా కాలువలో దూకిన దంపతులు

● భార్య మృతదేహం లభ్యం
● గల్లంతైన భర్త


సోమలింగమ్మ


సీతన్న

గుంతకల్లు పట్టణం, చిప్పగిరి, న్యూస్‌టుడే: గుంతకల్లు గ్రామీణ మండలంలోని హంద్రీనీవా కాలువలో దూకిన దంపతుల్లో ఒకరు మృతి చెందగా, మరొకరు గల్లంతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కసాపురం ఎస్సై వెంకటస్వామి, స్థానికులు తెలిపిన మేరకు. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం బెల్డోణ గ్రామానికి చెందిన సీతన్న(64), సోమలింగమ్మ(60) దంపతులు. ఉదయం గుంతకల్లు ఆసుపత్రికి వెళుతున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి కసాపురం చేరుకున్నారు. కసాపురం-మద్దికెర మధ్య ప్రవహించే హంద్రీనీవా కాలువలో స్నానం చేయడానికి అన్నట్టుగా మొబైల్, చిన్న పుస్తకం, చెప్పులు, ఇతర సామగ్రి గట్టుపై పెట్టారు. ఇద్దరూ కలిసి ఒక్కసారిగా కాలువలోకి దూకారు. గమనించిన స్థానికులు వారిని రక్షించడానికి ప్రయత్నించేలోపు మునిగిపోయారు. ఒడ్డున పెట్టిన పుస్తకంలోని చరవాణి నంబర్ల సాయంతో స్థానికులు దంపతుల బంధువులకు సమాచారం ఇచ్చారు. కొన్ని గంటల తర్వాత బంధువులు, పోలీసులు అక్కడికి చేరుకుని కాలువలో గాలించారు. రైల్వే ట్రాకు దగ్గరలో సోమలింగమ్మ మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సీతన్న కోసం గాలింపు సాగుతోంది. వారిద్దరి ఆరోగ్యం బాగోలేదని, సీతన్నకు ఇటీవల శస్త్రచికిత్స జరిగిందని, ఆ బాధతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని వారి కుమారుడు నారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వివాహానికి వెళ్లి వస్తూ.. రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు


శ్రీరాములు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: వివాహానికి వెళ్లి వస్తున్న ఓ వ్యక్తిని కారు రూపంలో మృత్యువు కబళించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాలిలా.. కదిరికి చెందిన శ్రీరాములు (50) కొంతకాలం క్రితం అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని కొత్తఇండ్లులో నన్నారి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈయనకు భార్య నీలమ్మ, కుమార్తెలు మమత, భూమిక ఉన్నారు. ఉదయం సీటీఎం గ్రామంలో వీరి బంధువుల వివాహానికి వెళ్లారు. అనంతరం ఆయన బంధువైన బండ్లపాయి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, శ్రీరాములు కలిసి ద్విచక్రవాహనంపై మదనపల్లెకు వస్తూ తట్టివారిపల్లె వద్ద ఉన్న తిరుపతి రోడ్డులో రాంగ్ రూట్‌లో వచ్చారు. అదే సమయంలో తిరుపతి వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీరాములు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడగా తిరుపతికి రెఫర్ చేశారు. రూరల్ ఎస్ఐ విష్ణు నారాయణ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

లారీ క్యాబిన్‌లో ఇరుక్కుని డ్రైవర్..

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి మండలం ఎరుకలవాండ్లపల్లి సమీపంలో 42వ జాతీయ రహదారి పై ఆగి ఉన్న లారీని వెనకవైపు నుంచి వచ్చిన మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో తమిళనాడు వేలూరుకు చెందిన డ్రైవర్ గణేశన్ (63)మృతి చెందాడు. కదిరి అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన మేరకు.. ఆదివారం తెల్లవారుజామున ఐరన్‌లోడ్‌తో వస్తున్న లారీ సాంకేతిక సమస్యతో ఎరుకలవాండ్లపల్లి వద్ద ఆగిపోయింది. అదే సమయంలో అనంతపురం వైపు నుంచి తమిళనాడు వెళ్తున్న మరో లారీ ఆగి ఉన్న లారీని ఢీకొంది. ప్రమాదంలో డ్రైవర్ గణేశన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి సిబ్బందితో పాటు అక్కడికి చేరుకుని స్థానికుల సాయంతో డ్రైవర్‌ను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన అతను అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


ఇరుక్కుపోయిన గణేశన్

రైలు నుంచి పడి యువకుడి దుర్మరణం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి యువకుడు వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. హిందూపురం రైల్వే ఎస్సై లావణ్య తెలిపిన వివరాల మేరకు ధర్మవరం పట్టణం ఇందిరానగర్‌కు చెందిన హర్షవర్ధన్(21), ధర్మవరం నుంచి పెనుకొండ వైపు వెళ్లే రైలులో ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని జేబులో అనంతపురానికి వెళ్లే రైలు టిక్కెట్లు లభించాయి. మృతుడు చేనేత కార్మికుడు, అవివాహితుడు. అతనికి తల్లిదండ్రులు శ్రీనివాసులు, కాంతమ్మ ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కర్ణాటక వాసి..

హిందూపురం, న్యూస్‌టుడే: నారాయణపురం-పెనుకొండ రైల్వేస్టేషన్ మధ్య ఆదివారం మధ్యాహ్నం కర్ణాటక రాష్ట్రం హవేరీ తాలుకా, బసాపూర్‌కు చెందిన అరుణ్‌చావడి (28) ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

కమనీయం రంగనాథుడి గిరిప్రదక్షిణ



ప్రత్యేక అలంకరణలో రంగనాథుడు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని గుడ్డంరంగనాథ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. రాత్రి శ్రీదేవిభూదేవి సమేతుడైన రంగనాథుడి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పూల రథంలో ఉంచి భక్తుల గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాలతో ఆలయం చుట్టూ గిరిప్రదక్షిణ చేశారు. మహిళలు భక్తిగీతాలను ఆలపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

ఆకట్టుకున్న గజ్జల పూజోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని సూగూరు సమీపంలో ఉన్న ఏటిగడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలో స్థానిక కసల పేటలో ఉన్న గడిస్వర సాంస్కృతిక కళా నిలయం నిర్వాహకురాలు విద్యారాణి ఆధ్వర్యంలో గజ్జల పూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు భాగవతం, రామాయణం, శ్రీకృష్ణుడి ఆరాధన చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. ఒకే వేదికపై 78 మంది చిన్నారులు నృత్యం చేయడం ఆసక్తిగా నిలిచింది. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం: 91548 46650
పెనుకొండ: 91000 20922
మడకశిర: 76759 19016

సమస్య: మద్దనకుంట, చిన్నమీదాపల్లోలో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంది. నీటికోసం పాట్లు పడుతున్నాం. ఇబ్బంది తీర్చాలి. - **శివకుమార్**

సమాధానం: బోరు తవ్వించాం. మోటారు, స్టార్టరు అమర్చి తాగునీటి సమస్య పరిష్కరిస్తాం. - **హాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ**

సమస్య: మడకశిరలో, పీఎస్‌పేట్లో మద్దనకుంట రోడ్డు ఇరువైపుల కంపచెట్లు పెరిగాయి. రెండు వాహనాలు పక్కపక్కగా వస్తే కంపలు గీసుకుని గాయాలవుతున్నాయి. - **ముద్దుగిరియప్ప**

సమాధానం: కంప చెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - **మహంతేశ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, మద్దనకుంట**

- **న్యూస్‌టుడే, గుడిబండ**

సమస్య: మండలంలోని ఆర్. గొల్లహట్టి గ్రామంలో కుళాయికి బిరడా లేక నీరు వృథాగా పోతోంది. - **నాగప్ప**

సమాధానం: కుళాయికి బిరడా వేసి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటాం. - **నరసేగౌడ్, పంచాయతీ కార్యదర్శి, రత్నగిరి**

సమస్య: బీజేహళ్లి గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో ఎలుగుబంట్లు సంచరిస్తుండటంతో భయంగా ఉంది. సమస్య తీర్చాలి. - **ఉదయకుమార్**

సమాధానం: గతంలో వేసిన దీపాలు పాడైపోయాయి. వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయిస్తాం. - **అజయకుమార్, పంచాయతీ కార్యదర్శి, బీజేహళ్లి** - **న్యూస్‌టుడే, రొళ్ల**

పరిటాల రవీంద్రకు నివాళి

పెనుకొండ, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఆయన విగ్రహానికి కూటమి శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

పేరుకే గోదాములు.. తీయలేదు తాళాలు

రూ.కోట్లు వెచ్చించినా.. నీరుగారిన లక్ష్యం

పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, హిందూపురం, గుడిబండ, న్యూస్‌టుడే: రైతులు పండించిన పంటను నిల్వ, భద్రపరచుకునేందుకు బహుళ ప్రయోజనం కోసం నిర్మించిన గోదాములు చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో 18 మంజూరవగా.. 7 వినియోగంలో ఉన్నాయి. 11 వివిధ దశల్లో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచాయి. ప్రభుత్వ లక్ష్యం నిర్మాణ దశల్లోనే నీరుగారింది. వీటి నిర్మాణానికి రూ.కోట్లు వెచ్చించినా రైతులకు ఇసుమంత ప్రయోజనం చేకూర్చలేకపోయారు.

◆ గత వైకాపా పాలనలో ప్రభుత్వం ప్రాథమిక సహకార సంఘాలను బలోపేతం చేయాలని రూ.లక్షలు వెచ్చించి నిర్మించి వృథాగా వదిలేశారు. * పెనుకొండ నియోజకవర్గం పరిధిలో 10 గోదాములు మంజూరవ్వగా ఒకటి మాత్రమే వినియోగంలో ఉంది.

మూడు నియోజకవర్గాల్లో..
- ◆ హిందూపురం, మడకశిర, పెనుకొండ
- ◆ మంజూరైన గోదాములు: 28
- ◆ నిధులు: రూ.11.20 కోట్లు
- ◆ ఉపయోగంలో ఉన్నవి: 8
- ◆ నిరుపయోగంగా ఉన్నవి: 9
- ◆ వివిధ దశల్లో ఆగినవి: 11

మిగిలినవి నిరుపయోగమే. ◆ 500, 1000 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో గ్రామీణ ప్రాంతాల్లో వీటిని నిర్మించారు. ఎక్కువగా గన్నీస్నాన్న ఇవి ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నా ఏం.. లాభమండీ

పెనుకొండ మండలంలోని వెంకటగిరిపాళ్యంలో ఇస్లాపురం సొసైటీ ఆధ్వర్యంలో రూ.40లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించారు. గోదాం చుట్టూ ముళ్ల పొదలు పెరిగిపోయి పరిసరాలు అధ్వానంగా మారాయి.

◆ రొద్దం సొసైటీ పరిధిలోని రాగిమేకలపల్లిలో, చిన్నమంతూరులో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించిన గోదాములు ప్రారంభానికి నోచుకోలేదు.

◆ సోమందేపల్లి పరిధిలోని నక్కల గుట్ట కాలనీ శివారులో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.



గుడిబండ: వీరజనపల్లిలో అసంపూర్తిగా గోదాం

వినియోగంలోకి తెచ్చేలా చర్యలు

నిర్మాణాలు పూర్తయినా ఖాళీగా ఉన్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అద్దెకు ఇచ్చేలా చూస్తాం. - **హరికృష్ణ, జయరాం, సీఈవోలు, పెనుకొండ, సోమందేపల్లి**

◆ శాఖ ఉన్నతాధికారుల ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి గోదాములు వినియోగంలోకి వచ్చేలా చూస్తాం. - **ఆదినారాయణ, హిందూపురం డివిజన్ ఏడీసీసీ బ్యాంకు అధికారి**

అర్హులందరినీ ఓటరు జాబితాలో చేర్చండి

హిందూపురం పట్టణం, సాంస్కృతికం, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చేలా చూడాలని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా బీఎల్వోలు, సూపర్‌వైజర్ల వారీగా పత్రాలను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. పత్రాల ప్రవేశికరణ ప్రక్రియ ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఉన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో పత్రాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

గడువులోగా విచారణ పూర్తి చేయాలి

లేపాక్షి, న్యూస్‌టుడే: నోటీసులు అందుకున్న ఓటర్ల విచారణ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని జేసీ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో జేసీ సమీక్షించారు. ఓటరు సమస్యలు గుర్తించి పత్రాలను పక్కాగా పరిశీలించి తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలన్నారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, తదితరులు ఉన్నారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

చిలమత్తూరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై చిలమత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో గతంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చిన అర్జీల పరిష్కారం గురించి హిందూపురం ఎమ్మెల్యే సూచన మేరకు ఆయన వ్యక్తిగత సహాయకులు వీరయ్య ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఏపీ లక్ష్మీనారాయణతో మాట్లాడారు. గతంలో వచ్చిన అర్జీల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు.

కేయాన్స్ వైద్య సేవలకు ఆర్థికసాయం



కేయాన్స్ తల్లికి చెక్కు అందిస్తున్న ఆలయ కమిటీ ఛైర్మన్, డైరెక్టర్లు

లేపాక్షి, న్యూస్‌టుడే: పాత లేపాక్షికి చెందిన నటరాజ్, శైలజ దంపతుల రెండున్నరేళ్ల కుమారుడు కేయాన్స్ ఎస్ఎంఏ-2తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ పరిగి వేణుగోపాల్‌రావు ఆదివారం రూ.50వేల చెక్కును బాధిత చిన్నారి తల్లికి అందించారు. అదే స్ఫూర్తితో ఆలయ కమిటీ డైరెక్టర్ మహేంద్ర, మిత్ర బృందం ఆత్మశ్రీ కన్నడ సాంస్కృతిక ఫౌండేషన్ తరపున రూ.15వేలు, నరసప్ప రూ.5వేల ఆర్థికసాయం చేశారు.

పేదలకు పోషకాహార కిట్ల అందజేత



కిట్లు అందుకున్న పేదలతో సంఘం ప్రతినిధులు

హిందూపురం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన యూత్ ఫర్ బెటర్ హిందూపూర్ ఆధ్వర్యంలో 70 మంది పేదలకు ఆదివారం పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు సీటీ కిషోర్ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు, బాలికలకు తగిన పోషకాహారం అందక అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని.. తమ వంతుగా కొంత సాయం చేశామన్నారు. మరింత మందికి సాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

నీటి సమస్య తీర్చండి



ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, ఎంపీ పార్థసారథి

మడకశిర, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు తెలిపారు. ఆదివారం అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే స్వాగతం పలికి స్థానిక అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరందించేందుకు బైపాస్ కాలువ చాలా అవసరమని తెలియజేశారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఎంపీ బీకే పార్థసారథి సీఎంకు స్వాగతం పలికారు. పలు సమస్యలను ఆయనకు వివరించి.. పరిష్కరించాలని కోరారు.

కాలువల్లేక.. ఇబ్బంది తీరక

కోడిపల్లి గ్రామంలోని వీధులు అపరిశుభ్రంగా మారాయి. బీసీ, ఎస్సీ కాలనీల్లో రోడ్లపై మురుగు నీరు పారుతోంది. కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని వాడుక, వర్షపు నీరు దారిపైకి చేరుతోంది. మట్టిదారులు అధ్వానంగా తయారయ్యాయి. నడకవలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి రాజునాయక్ మాట్లాడుతూ సిబ్బందిని పంపి పరిసరాలు శుభ్రం చేయిస్తామని. కాలువల నిర్మాణంపై ప్రతిపాదనలు పంపుతామన్నారు. - **న్యూస్‌టుడే, అగళి**



ట్యాంకు పరిసరాలు.. అధ్వానం

మండలంలోని కాలువేపల్లి గ్రామంలో తాగు నీటి ట్యాంకు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి పరిసరాలు అధ్వానంగా మారాయి. కుళాయిలకు అమర్చిన బిరడాలను ఆకతాయిలు తొలగించడంతో ట్యాంకుకు నీరు నింపడం లేదు. దీంతో ట్యాంకు అపరిశుభ్రంగా మారింది. నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఉప ఎంపీడీవో సుధాకర్ మాట్లాడుతూ ట్యాంకు శుభ్రం చేయించి నీరు అందిస్తామన్నారు. - **న్యూస్‌టుడే, రొళ్ల**



మూతపడి పదేళ్లు.. తెరిచేందుకెన్నేళ్లు?

మండల కేంద్రంలోని పాత ఎస్సీ కాలనీ వద్ద ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉన్నారంటూ పదేళ్ల కిందట పాఠశాల మూసివేశారు. అప్పటి నుంచి ఈ భవనం వృథాగా ఉంది. ఇక్కడి విద్యార్థులను గ్రామానికి దూరంగా ఉన్న పాఠశాలకు పంపుతున్నారు. భవనం అందుబాటులోకి తెస్తే ఇతర అవసరాల కన్నా ఉపయోగపడుతుందని స్థానికులు కోరుతున్నారు. ఎంపీడీవో రామారావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. - **న్యూస్‌టుడే, అమరాపురం**



నిర్మించారు.. వృథాగా వదిలారు



మండలంలోని పూజారిపల్లిలో పశువుల నీటి తొట్టె నిరుపయోగంగా మారింది. ఖాళీగా ఉండడంతో నెర్రలు తేలి పెచ్చులూడుతోంది. పశువుల దాహార్తిని తీర్చేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూరంలోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీరు తాపాల్సి వస్తోంది.. తొట్టె ఉన్నాప్రయోజనం లేకుందని వాపోతున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో నాగరాజునాయక్ మాట్లాడుతూ పరిశీలించి సమస్య తీర్చుతామన్నారు. - **న్యూస్‌టుడే, గుడిబండ**

పంపు ఉంది.. పనిచేయకుంది

మండలంలోని మద్దనకుంటలో చేతిపంపు పనిచేయట్లేదు. గ్రామంలో నీటి సమస్య అధికంగా ఉండటంతో స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఏళ్లుగా ఈ చేతిపంపు మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం నీటి ఇక్కట్లు వేధిస్తుండటంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అమరేశ్ వివరణ కోరగా.. పరిశీలిం మరమ్మతులు చేయించి వినియోగంలోకి త్వరలోనే తెలిస్తామని తెలిపారు. - **న్యూస్‌టుడే, గుడిబండ**



నీరు చేరి.. బురదగా మారి

స్థానిక నక్కలగుట్ట కాలనీలో తాగునీటి పైపు లైన్ దెబ్బతిని నీరు రోడ్డుపై పారుతున్నాయి. దీంతో దారంతా బురదగా మారింది. రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. తరచూ వృద్ధులు, పిల్లలు ముఖ్యంగా రాత్రిళ్లు ఇక్కడి బురద నీటిలో జారి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ వెంటనే మరమ్మతులు చేయించి, సమస్యను పరిష్కరిస్తామన్నారు. - **న్యూస్‌టుడే, సోమందేపల్లి**



పిల్లలకు మాయమాటలు చెప్పి చోరీ

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక హిందూపురం ఆర్ అండ్‌బీ రహదారిలో పెట్రోల్ బంకు పక్కనున్న ఓ ప్రైవేట్ పాల డెయిరీలో పట్టపగలే నగదు చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆదివారం మధ్యాహ్నం పాల ప్యాకెట్ కావాలంటూ ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు డెయిరీలో ఉన్న పిల్లలకు రూ.వంద నోటు ఇచ్చారు. తామే చిల్లర తీసుకొంటామని క్యాష్ కౌంటర్‌లోకి చేయి పెట్టి ఏకంగా రూ.10 వేలు తీసుకొని అక్కడి నుంచి క్షణాల్లో ఉడాయించారు. విషయం తెలుసుకున్న వ్యాపారి చరణ్ వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు డెయిరీలోని పిల్లల నుంచి వివరాలు సేకరించారు. చుట్టుపక్కల సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎంబీరేపల్లి సమీపంలో నాగరాజు అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఒక్కసారిగా వాహనం అదుపుతప్పి పడిపోయింది. తీవ్రంగా గాయపడిన అతడిని 108వాహనంలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు.

మితిమీరిన వేగం.. కబళిస్తోంది ప్రాణం

కేఎస్ఆర్టీసీ చోదకుల నిర్లక్ష్యం.. వారానికో ప్రమాదం

మడకశిర, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రానికి చెందిన కేఎస్ఆర్టీసీ బస్సుల చోదకుల మితిమీరిన వేగం ప్రజల ప్రాణాలు తీస్తోంది. సరిహద్దు ప్రాంతమైన మడకశిర పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఈ బస్సుల అతివేగం కారణంగా వారానికో ప్రమాదం జరుగుతోంది. దీంతో పక్క వారి ప్రాణాల మీదకు తెస్తోంది. ప్రధానంగా కర్ణాటకలోని పావగడ నుంచి మధుగిరి, తుమకూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు మడకశిర కేంద్ర బిందువుగా ఉంది. ఇక్కడి నుంచి 10 నిమిషాలకు ఒక కర్ణాటక బస్సు వెళ్తోంది. ఇక్కడి నుంచి ప్రయాణికులు ఎక్కువగానే బెంగళూరుకు ప్రయాణిస్తుంటారు. దీంతో వారిని తమ బస్సులోనే ఎక్కించుకోవాలన్న ఆతృతతో ఆయా బస్సుల డ్రైవర్లు అతివేగంతో నడుపుతున్నారు. ఆ వేగమే ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదానికి దారితీస్తోంది.

■ రోడ్డు దాటుతున్న బాలుడిని తప్పించబోయి ఎదురుగా వస్తున్న పాఠశాల బస్సును కర్ణాటక బస్సు శనివారం ఢీకొట్టడంతో 8 మంది చిన్నారులు తీవ్రగాయాలైన ఘటన తెలిసిందే. 'ఈ ప్రమాదాలు ఎప్పుడో ఒకసారి జరుగుతున్నవి కాదు. తరచూ కేఎస్ఆర్టీసీ చోదులకు మీతిమీరుతున్నా స్థానిక అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆయువు తీశారిలా..

గత ఏడాది ఉగాది పండుగ రోజు రాజీవ్ గాంధి కూడలి సమీపంలో కేఎస్ఆర్టీసీ బస్సు రోడ్డుపై వెళ్తున్న రంగప్పను బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

■ 2024 డిసెంబర్ 25న మధుగిరి రోడ్డులో ద్విచక్రవాహనం పై వెళ్తున్న గౌడనహళ్లి నారాయణప్ప అనే వ్యక్తి పైకి కర్ణాటక బస్సు దూసుకెళ్లడంతో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు.

■ ఈ ఏడాది జనవరిలో మండల పరిధిలోని యు.రంగాపురం గ్రామంలో బెంగళూరు వెళ్తున్న బస్సు అత్యంత వేగంగా దూసుకురావడంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న కర్ణాటక రాష్ట్రం శిరాకు చెందిన భార్యభర్తను ఢీకొట్టింది. వారు తీవ్ర గాయాలతో ఆసుపత్రిపాలయ్యారు. ■ ఈ ఏడాది మార్చిలో మడకశిర-పావగడ వెళ్లే దారిలో శివాపురం సమీపంలో వేగంగా వెళ్తున్న బెంగళూరు కేఎస్ ఆర్టీసీ బస్సు స్టీరింగ్ కట్ కావడంతో రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ■ అతివేగంగా వెళ్లకుండా డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.



ఆమిదాలగొంది సమీపంలో పాఠశాల బస్సును ఢీకొన్న కర్ణాటక బస్సు

లేపాక్షి చారిత్రక నిర్మాణం అద్భుతం

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షి పురాతన కట్టడాలు, చారిత్రక నిర్మాణాలు అద్భుతంగా ఉన్నాయని వీటి గురించి మరింత ప్రచారం చేయాలని రాష్ట్ర ఆర్థిక, గణాంక శాఖ సంచాలకులు బి.గోపాల్ అన్నారు. ఆదివారం ఆయన సతీసమేతంగా లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. పురాతన కట్టడాలు, చారిత్రక నిర్మాణాలు, నాట్యమండపం, లతామండపం, అర్ధాంతరంగా ఆగిన కల్యాణ మండపం, సీతమ్మపాదం, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, ఏకశిలా నంది విగ్రహం తదితర ఆలయ చరిత్రను తెలుసుకున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

హిందూపురం, న్యూస్‌టుడే: శ్రీకంఠపురం అరుంధతినగర్‌లో ఉన్న ప్రసన్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి పలువురు దాతలు ఆదివారం విరాళాలు ఇచ్చారు. మాజీ కౌన్సిలర్ నాగరాజు రూ.20వేలు విలువ చేసే మైక్‌సెట్, గొడుగు, ఇతర సామగ్రి, పట్టణానికి చెందిన రమేష్ రూ.55వేల విలువైన ఫర్నిచర్ అందించారు.

వైద్య శిబిరానికి స్పందన

చిలమత్తూరు, న్యూస్‌టుడే: కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సత్యసాయి యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు చిలమత్తూరు సత్యసాయి సేవాసమితి, భజన మండలి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో కంటికి 46, పంటికి సంబంధించి 66 మందికి వైద్య పరీక్షలు చేశారు. 59 మందికి ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా మెడికల్ ఇన్‌ఛార్జులు సీఆర్ రావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రుణం.. ఆర్థిక వృద్ధికి ఊతం

డ్వాక్రా సంఘాలతో మహిళలకు తోడ్పాటు

మడకశిర గ్రామీణం, అమరాపురం, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల తోడ్పాటుతో సంఘ సభ్యులు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులేస్తున్నారు. స్త్రీనిధి, బ్యాంకు రుణాలు తీసుకొని డ్వాక్రా సంఘాల మహిళలు చిన్న చిన్న వ్యాపారాలు, కుటీర పరిశ్రమలపై వెచ్చించి లాభాలు గడిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. పురుషులతో సమానంగా ప్రతి నెలా వేల రూపాయల ఆదాయం పొందుతూ కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారు.

ఇంటి వద్దనే ఉపాధి



గతంలో కుటుంబ సభ్యులు ఆలయంలో పూజారి వృత్తి చేస్తుండేవారు. వారికి వచ్చే ఆదాయంతో కుటుంబం గడవడం కష్టంగా ఉండేది. మూడేళ్ల కిందట స్త్రీనిధి రుణం రూ.2 లక్షలు తీసుకుని ఇంట్లోనే కంప్యూటర్, ప్రింటర్ ఏర్పాటు చేసుకున్నా. భర్త సురేంద్ర సహకారంతో కంప్యూటర్ శిక్షణ పొందా. ప్రస్తుతం స్థానికంగా విద్యార్థులకు, రైతులకు, స్థానికులకు అవసరమైన ఫొటోలు, జిరాక్స్‌లు, పుస్తకాలు, పెన్నులు తదితరాలు అందుబాటులోకి తెచ్చా. ఇంటి వద్దే ఉపాధి పొందుతూ నెలకు రూ.15వేల వరకు సంపాదిస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నా. - **శిరీష, గౌడనహళ్లి**

కష్టాల నుంచి బయటపడ్డాం



వ్యవసాయానికి పెట్టుబడి పెట్టి అప్పులు పాలయ్యాం. అప్పులు తీర్చలేక.. కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. స్వయం సహాయక సంఘాల్లో రుణాలు తీసుకొని కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకున్నాం. అప్పటి నుంచి మా కష్టాలు తీరుతూ వచ్చాయి. ఇప్పటి వరకు రూ.16 లక్షల వరకు రుణం తీసుకుని సకాలంలో చెల్లించగలిగాం. కిరాణా దుకాణంతో వచ్చే ఆదాయంతోనే ఇద్దరు కుమార్తెల్లో ఒకరిని బీటెక్, ఇంకొకరిని ఇంటర్ చదివిస్తున్నాం. భర్త వ్యవసాయ పనులు చేసుకుంటూ వ్యాపారంలో సహకరిస్తున్నారు. - **మీనాక్షి, అమరాపురం**

సిమెంటు దిమ్మెలు.. ధ్వంసం



రొద్దం పెన్నానది వంతెనపై నిర్మించిన సిమెంటు దిమ్మెలు రెండవైపులా ధ్వంసమయ్యాయి. ఈ వంతెనపై నిత్యం వందల వాహనాలు, పెద్ద సంఖ్యలో కంటైనర్లు తిరుగుతుంటాయి. రొద్దం మీదుగా పెనుకొండ, పావగడ వెళ్లే ప్రధాన రహదారిలో వంతెనపై తరుచుగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. - **న్యూస్‌టుడే, రొద్దం**

వైభవంగా రాఘవేంద్రుడి ఆరాధనోత్సవాలు



పురవీధుల్లో పూలరథాన్ని లాగుతున్న బ్రాహ్మణులు

హిందూపురం సాంస్కృతికం, గ్రామీణం: పట్టణంలోని రాఘవేంద్రస్వామి బృందావనం సన్నిధిలో ఆదివారం ఆరాధనోత్సవాలను వైభవంగా జరిగాయి. స్వామి వారికి సుగంధద్రవ్యాలతో పంచామృతాభిషేకం, హోమాలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన రథంలో సీత రామలక్ష్మణులు, ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను ఉంచి వేదపండితులు పురవీధుల గుండా ఊరేగించారు. ■ చింతపల్లిలో రాఘవేంద్రుడికి ప్రత్యేక పూజలు చేశారు.

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

50 మంది చిరువ్యాపారులకు తోపుడుబండ్లు ఇస్తాం..

కనగానపల్లి, న్యూస్‌టుడే: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఎమ్మెల్యే పరిటాల సునీత పనిచేస్తున్నారని రాప్తాడు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ సుధాకర్ నాయుడు, మండల కన్వీనర్ యాతం పోతులయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ...పరిటాల రవీంద్ర జయంతిని పురస్కరించుకుని మండలకేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ వద్ద రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లికి చెందిన 50 మంది చిరు వ్యాపారులకు ఒక రూ.10 లక్షల విలువజేసే తోపుడుబండ్లను ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సరిగ్గా వినియోగించుకున్నప్పుడే పరిటాల రవి ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు.

చిగిచెర్ల పాఠశాలకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు

ధర్మవరం పట్టణం: మండల పరిధి చిగిచెర్ల ఉన్నత పాఠశాలకు వరుసగా మూడోసారి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును కైవసం చేసుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, పీడీ ప్రతాప్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పీడీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఏడాది పాటు జరిగిన క్రీడాపోటీల్లో వివిధ విభాగాల్లో పాల్గొని 226 పాయింట్లతో మొదటి స్థానంలో చిగిచెర్ల ఉన్నత పాఠశాల నిలిచిందన్నారు. ఈనెల 29న స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు 2026-27కు ప్రకటించినట్లు ఆయన తెలిపారు.


కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ నుంచి అవార్డు అందుకుంటున్న పీడీ ప్రతాప్‌రెడ్డి, విద్యార్థులు

ఘనంగా పరిటాల రవీంద్ర జయంతి

ధర్మవరం, బత్తలపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతి వేడుకలను ఆదివారం ధర్మవరం పట్టణం బత్తలపల్లి, సీకేపల్లి, కనగానపల్లి, రాప్తాడులలో ఘనంగా నిర్వహించారు. ధర్మవరంలో తెదేపా నాయకులు విజయ్‌కుమార్, మహేష్ చౌదరి.., బత్తలపల్లిలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, పల్లె శ్రీనివాసులు, సురేంద్రనాయుడు.., రామగిరి మండల కేంద్రంలో తెదేపా మండల కన్వీనర్ సర్కార్, టీఎన్‌టీయూసీ నాయకులు నాగేశ్వరనాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు ముత్యాలప్ప, మండల ప్రధాన కార్యదర్శి అవుల ముత్యాలప్ప.., సీకేపల్లి మండల కేంద్రంలో తెదేపా ప్రధాన కార్యదర్శి ముత్యాలప్ప, మాజీ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.


ధర్మవరంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తెదేపా నాయకులు

నిధుల రాకతో రోడ్లకు మహర్దశ

■ గ్రామాల్లో దారుల నిర్మాణానికి మార్గం సుగమం


దుమ్మురేగుతున్న నాయనపల్లి-దాడితోట గ్రామాల దారి

ధర్మవరం పట్టణం, తాడిమర్రి, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రధాన రహదారులు మరమ్మతులు, నూతన దారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. వైకాపా హయాంలో దెబ్బతిన్న రోడ్లపై గ్రామీణ ప్రజలు ప్రయాణించలేక అవస్థలు పడ్డారు. గుంతలు పడిన దారుల్లో రాకపోకలు సాగించలేక కొందరు గాయపడితే, పలువురు మృత్యువాత పడిన ఘటనలెన్నో ఉన్నాయి. రోడ్లకు మరమ్మతులు చేసి, ప్రజల ప్రాణాలు కాపాడాలని నాయకులు, ప్రజలు రోడ్డెక్కి నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ప్రాధాన్యతగా ప్రమాదకరంగా ఉన్న గ్రామీణ ప్రాంత రోడ్లకు నిధులు మంజూరు చేసింది. రెండున్నరేళ్ల కాలంలో పలు దారులకు రూ.కోట్లాది నిధులను మంజూరు చేసి నూతన రోడ్లను ఏర్పాటు చేసింది. తాజాగా నియోజకవర్గంలోని ధర్మవరం రూరల్, ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాల్లోని గ్రామాలకు తారురోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉపి, పంచాయతీ రాజ్ శాఖ (ప్రాజెక్టు) పద్దతుల్లో పనులు జరిగేలా ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే మంజూరైన రోడ్ల పనులకు ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించడంతో పలువురు గుత్తేదారులు వాటిని దక్కించుకున్నారు. వచ్చే మూడు, నాలుగు నెలల్లో నిధులు మంజూరైన అన్ని రోడ్ల పనులను సకాలంలో పూర్తి చేయాలని పీఆర్ శాఖాధికారులు కింది స్థాయి ఇంజినీర్లను ఆదేశించారు. వారం, పది రోజుల్లో గుత్తేదారులు అగ్రిమెంట్లు చేసుకొని పనులను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. 46 కి.మీ దూరంతో చేపట్టే 8 దారులకు సుమారుగా రూ.20 కోట్ల నిధులను మంజూరు చేసింది.

మంజూరైన రోడ్డు	దూరం (కి.మీ)	నిధులు (రూ.కోట్లలో)
రావుల చెరువు, వెంకట తిమ్మాపురం మీదుగా మల్లేనిపల్లి రహదారి	13.8కి.మీ	3.91
వెంకట తిమ్మాపురం-దర్శినమల వరకు	2.55కి.మీ	1.27
గొట్లూరు, ధర్మపురి వయా మల్లేనిపల్లి	6.08కి.మీ	4.40
మల్లాపల్లి వయా పి.కొట్టాల (ముదిగుబ్బ)	7.0కి.మీ	3.73
ఏపీపల్లి తండా నుంచి మారెమ్మ గుడి వరకు (అప్రోచ్ రోడ్డు)	1.5కి.మీ	0.85
మలకవేముల నుంచి సానేవారిపల్లి వరకు	6.కి.మీ	1.38
సంకేపల్లి నుంచి బ్రహ్మదేవర మర్రి (బీడుమర్రి)	5.కి.మీ	2.50
దాడితోట నుంచి నాయనపల్లి గ్రామం వరకు	5.కి.మీ	1.76

త్వరలోనే పనులు ప్రారంభిస్తారు

సమస్య ఉన్న గ్రామాల దారులకు నిధులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. పనులకు నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులను ప్రారంభించాలని, నాణ్యతగా చేపట్టాలని గుత్తేదారులను ఆదేశించాం. **- తిరుమలరెడ్డి, సూర్యశేఖర్, పంచాయతీరాజ్ డీఈలు**

కాంక్రీట్ వేశారు.. క్యూరింగ్ మరిచారు



కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువులో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనుల్లో కాంక్రీట్ వేసి క్యూరింగ్ చేయకుండా వదిలేశారు. గత తెదేపా హయాంలోనే ఇండోర్ స్టేడియం మంజూరైంది. అయితే వైకాపా ప్రభుత్వ హయాంలో పునాదులకే పరిమితమైంది. గత ఏడాది జూన్‌లో ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఇండోర్ స్టేడియం పరిస్థితిని స్థానికులు తీసుకెళ్లారు. ఆయన ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేయడానికి రూ.3కోట్ల నిధులు మంజూరు చేశారు. నాలుగేళ్ల నెలలుగా పనులను ప్రారంభించిన గుత్తేదారు గోడ పనులు చేపట్టారు. మూడు రోజుల క్రితం పైకప్పు కాంక్రీటు వేశారు. అయితే ఇంతవరకూ క్యూరింగ్ కోసం కాంక్రీటుపై నీరు పోసేవారు లేక ఎండిపోయింది.

నేడు డయల్ యువర్ ఎస్ఈ

పుట్టపర్తి, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 8 నుంచి 9.30 గంటల డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని ఏపీఎస్పీడీసీఎల్ నిర్వహించడం జరుగుతుందని ఎస్ఈ మోసెస్ తెలిపారు. జిల్లా స్థాయిలో విద్యుత్తు సమస్యలను దృష్టికి తీసుకువస్తే, పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 9490615721, 915459124 చరవాణులకు సమస్యలను తెలియజేయాలని కోరారు.

అధినేతకు స్వాగతం



అనంతపురంలో వివాహ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎం.ఎస్.రాజు
– ఈనాడు, అనంతపురం

అభివృద్ధికి రాచబాట పరుస్తాం..

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గం వ్యాప్తంగా ప్రతి గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమాలను ఆమె నిర్వహించారు. ఆత్మకూరు నుంచి పి.యాలేరు గ్రామం వరకూ 6కి.మీల మేర రూ.3 కోట్లతో తారు రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చాయని ఆమె వివరించారు. అనంతరం ఆత్మకూరు నుంచి నుసికొట్టాల గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. రూ.1.10 కోట్లతో 2 కి.మీల మేర తారురోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. రూ.కోటితో వేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆత్మకూరులోని చిరు వ్యాపారులకు 20 తోపుడు బండ్లను అందించారు. పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన చంద్రన్న అనే రైతు గొర్రెలు విషపునీరు తాగి మృతి చెందడంతో రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు.


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అవగాహనతో నేత్రదానానికి సమ్మతం

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన గిర్రాజు పార్థసారథి మృతి చెందారు. విషయం తెలియడంతో యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు మృతుని కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించగా భార్య మమత, కుమారుడు సౌరవ్ అంగీకరించారు. మృతుని నేత్రాలను ఎల్.వి.ప్రసాద్ ఆసుపత్రి టెక్నీషియన్ ప్రసాద్ ఆప్తమాలమిక్ సహాయకుడు సికిందర్ ఆదివారం సేకరించారు. ఆ ఫౌండేషన్ ప్రతినిధులు వైకే శ్రీనివాసులు, పోలా ప్రభాకర్ పాల్గొన్నారు.

అమరావతి ఛాంపియన్ షిప్ యోగా విజేతకు సన్మానం

ధర్మవరం, న్యూస్‌టుడే: అమరావతి ఛాంపియన్‌షిప్ - 2026 రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో ప్రథమ స్థానం సాధించిన శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండకు చెందిన ఎం.అశోక్‌కుమార్‌కు ఆదివారం ధర్మవరం రైల్వేస్టేషన్‌లో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్‌రెడ్డి, సభ్యులు సన్మానించారు. యోగా శిక్షకుడు సూర్యకృష్ణను కూడా సన్మానించారు. జిల్లా క్రీడల అధికారి కిశోర్, యోగా శిక్షకులు రవికుమార్, ఈశ్వరయ్య, వేణుగోపాల్, సాయిప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న సోమేశ్వర్‌రెడ్డి

ఉరుకుల ప్రయాణం.. సీటు గగనం

శ్రావణమాసం, వరుససెలవులు కావడంతో ఆదివారం కదిరి బస్టాండు ప్రయాణికులతో కిటకిటలాడింది. పల్లె, పట్నం తేడా లేకుండా బస్సు కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. బస్సు వచ్చిందంటే సీటు కోసం పరుగులు పెట్టాల్సిన పరిస్థితి. 40మంది ప్రయాణికులతో వెళ్లాల్సిన బస్సులో అంతకంటే ఎక్కువ మంది ఎక్కడంతో కండక్టర్ వెళ్లడానికి కూడా వీలులేనంతగా మారింది. **– న్యూస్‌టుడే, కదిరి పట్టణం**


బస్సు చుట్టూ గుమికూడిన ప్రయాణికులు


బదిలీ అధికారి పేరు మారదా?


సమాచార హక్కు చట్టం-2005
1. అప్పిలేట్ అధికారి అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ → శ్రీ.A.వెంకటేసు, A.P.C 9177371899
2. ప్రజా సమాచార అధికారి → K.హరిప్రసాద్ C.M.O/P.I.O 9490475950
3. సహాయక ప్రజా సమాచార అధికారి → T.శ్రీనివాసరావు సూపరింటెండెంట్ 9347227452

బుక్కపట్నంలోని సమగ్ర శిక్షా కార్యాలయం ఏపీసీగా ప్రస్తుతం డీఈఓ క్రిష్టప్ప ఇన్‌ఛార్జి బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వర్లు గత నెలలోనే బదిలీ అయ్యారు. అయినా సమాచార హక్కు చట్టం బోర్డులో మాత్రం ఆయన పేరు మారలేదు. కార్యాలయానికి వచ్చే జనం తికమక పడుతున్నారు. బోర్డులో పేరు మార్చి సమాచారం ఉండేలా చూడాలని కోరుతున్నారు. **–న్యూస్‌టుడే, బుక్కపట్నం**

కంచె ఏర్పాటు చేయరూ..

కదిరి- రాయచోటి రోడ్డులో పట్టుగూళ్ల విక్రయకేంద్రం వద్ద ఉన్న విద్యుత్తు నియంత్రిక దిమ్మె అధ్వానంగా మారింది. రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడం వల్ల ఏమరపాటుగా అటువైపు చోదకులు వెళితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఫ్యూజులు తక్కువ ఎత్తులో ఉన్నాయి, అధికారులు స్పందించి నియంత్రిక దిమ్మె మరమ్మతుతో పాటు కంచెను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, కదిరి పట్టణం**



భాజపాలోకి పలువురి చేరిక

గాండ్లపెంట, న్యూస్‌టుడే: వేపరాల పంచాయతీలోని పలువురు మైనార్టీ సోదరులు, ఇతర వర్గాలకు చెందిన కొందరు భాజపా మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు శేఖర్‌స్వామి సమక్షంలో ఆదివారం భాజపాలోకి చేరారు. భాజపాలోకి చేరిన వారిలో చేనేత కార్మికనాయకుడు గోపాల్, విజయ్‌కుమార్, రహిముల్లా, సాయి, భాస్కర్, అల్లాబకష్, ఇబ్రహీం, పరమేశ్వర ఉన్నారు. భాజపా మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు వెంకటేష్‌నాయక్, తలుపుల గంగాధర్, సయ్యద్‌బాషా, అలిఅహ్మద్ పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శిగా రమేష్‌బాబు

కదిరి, న్యూస్‌టుడే: భాజపా జిల్లా కార్యదర్శిగా తనను నియమించినట్లు రమేష్‌బాబు ప్రకటనలో ఆదివారం తెలిపారు. జిల్లా స్థాయి బాధ్యతలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యదర్శిగా తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, గంగాధర్, వంశీకృష్ణకు ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా మీడియా ఇన్‌ఛార్జిగా డీఎల్ ఆంజనేయులు

భాజపా జిల్లా మీడియా ఇన్‌ఛార్జిగా తనను నియమించినట్లు డీఎల్ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. 20ఏళ్లుగా పార్టీకి అందించిన సేవలకు గుర్తింపుగా బాధ్యతలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. తనకు జిల్లా మీడియా ఇన్‌ఛార్జిగా బాధ్యతలకు సహకరించిన భాజపా జిల్లా అధ్యక్షుడు జీఎంశేఖర్, మంత్రి సత్యకుమార్, జాతీయ ఆల్‌సెల్ జాయింట్ కోఆర్డినేటర్ విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవానంద్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ఇస్కాన్ టెంపుల్‌లో ఆదివారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇస్కాన్ టెంపుల్ జగన్నాథ, బలరామ, సుభద్ర మూలవిరాట్‌లకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయంలో చిన్నారులకు భక్తిరస పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలైన చిన్నారులకు ఆలయ నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. ఇస్కాన్ టెంపుల్ ఉమ్మడి జిల్లా ధర్మప్రచారకులు మాధవదాస్, గురువు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.


పోటీల్లో గెలిచిన చిన్నారులు

కంటి శస్త్రచికిత్సకు 41 మంది ఎంపిక

ధర్మవరం : ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం లయన్స్‌క్లబ్, లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గవ్వల రాధాకృష్ణ, దాత చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్ ప్రారంభించారు. శస్త్రచికిత్సకు 41 మందిని ఎంపిక చేశారు. వారికి పట్టణంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పేర్కొన్నారు. లయన్స్ ప్రతినిధులు వెంకటస్వామి, శ్రీరాములు, విజయ్‌కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రస్తా సమస్యకు శాశ్వత పరిష్కారం

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండలంలోని దొరిగల్లు రెవెన్యూ పరిధిలో నాలుగేళ్లుగా నెలకొన్న రస్తా సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. రైతు షేక్ ఫక్రుద్దీన్‌కు చెందిన సర్వే నంబరు 2033-1 లోని 3.80 సెంట్ల పొలానికి రస్తా లేకపోవడంతో ఆయన రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బందితో కలిసి రైతు పొలాన్ని పరిశీలించారు. పక్కనే ఉన్న 2033-2, 2033-3 సర్వే నంబర్లలోని పొలాలను పరిశీలించి, రస్తా ఏర్పాటు చేయించారు. దీంతో నాలుగేళ్లుగా కొనసాగుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.


విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయాల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ముదిగుబ్బలోని కస్తూర్బా పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాగునీటి కొరత, ఫ్యాన్లు పనిచేయడం లేదని విద్యార్థులు ఆయనకు తెలిపారు. తెదేపా నాయకులు తుమ్మల మనోహర్, నాయకులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు

కదిరి, న్యూస్‌టుడే: సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ స్నేహపూర్వక క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదివారం సెమీ ఫైనల్ పోటీలు నిర్వహించారు. కదిరి ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానంలో జరిగిన సెమీఫైనల్ పోటీల్లో 4 జట్లు తలపడ్డాయి. మొదటి మ్యాచ్‌లో నంబులపూలకుంట-1 జట్టుపై ధర్మవరం జట్టు విజయం సాధించింది. ఇందులో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన రాముకు కుంచెపు శీను జ్ఞాపికను అందజేశారు. తర్వాతి మ్యాచ్‌లో రొద్దం జట్టుపై ముదిగుబ్బ జట్టు గెలుపొందింది. ఇందులో వినోద్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌ను నిసార్ యాసిన్ చేతుల మీదుగా అందజేశారు. ఫైనల్‌కు చేరిన జట్లకు సెప్టెంబరు 4న పోటీ ఉంటుందన్నారు. ఫైనల్ ట్రోఫీలను సెప్టెంబరు 5న సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా కదిరిలోని తాయిగ్రాండ్ ఫంక్షన్ హాలులో ప్రదానం చేస్తారని నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులు ఆజంబాషా, రుద్రంరెడ్డి, ఆశ్వర్థ పాల్గొన్నారు.

రైతన్నకు ఆసరాగా పంటకుంట


దనియాన్‌చెరువులో పూర్తయిన పంట కుంట పనులు

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: కరవు పరిస్థితులు వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వర్షాలు సకాలంలో కురవకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం కారణంగా పంట సాగు చేసేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో పంట కుంటలు కొంతమేర ఉపశమనం కలిగిస్తాయని భావించిన కూటమి ప్రభుత్వం వాటి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఒక్కోదానికి పరిమాణాన్ని బట్టి రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు నిధులను కేటాయిస్తోంది. కదిరి డివిజన్ పరిధిలో పంటకుంటల నిర్మాణ పనులను మొదలు పెట్టారు.

భూగర్భ జలాల వృద్ధికి దోహదం

ఎల్‌నినో ప్రభావం కారణంగా కదిరి డివిజన్ పరిధిలో సాధారణ వర్షపాతం కంటే కూడా చాలా తక్కువగా నమోదైంది. ఈ పరిస్థితులలో ఖరీఫ్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. రైతులు ప్రస్తుత గండం నుంచి గట్టెక్కేందుకు పంట కుంటల నిర్మాణంతో భూగర్భ జలాలను పెంపొందించవచ్చు. వర్షాకాలంలో ఎకరాకు సుమారు 20 లక్షల లీటర్ల నీరు నిల్వ లభ్యమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో భూగర్భ జలాలు పెరిగి సాగుకు అవకాశాలు మెరుగవుతాయి.

సన్నకారు రైతులకు అవకాశం

వీబీ జీ రామ్‌జీ ద్వారా పంటకుంటలు తవ్వడానికి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. సన్న, చిన్నకారు రైతులు అయిదు నుంచి పది మీటర్ల పొడవు, వెడల్పుతో నిర్మించుకోవడానికి వీలు కల్పిస్తోంది. ఒక్కో కుంట నిర్మాణానికి 100 నుంచి 200 రోజుల పనిదినాలను కేటాయిస్తున్నారు. పేదలు తమ పొలంలో పని చేసుకుంటూ, పనిలేని రోజుల్లో ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. పొలంలో పంటకుంట నిర్మించుకోవాలనుకున్న రైతులు 5 ఎకరాల లోపు భూమి కలిగి ఉండాలి. ఉన్న వివరాలతో ఉపాధి కార్యాలయంలో క్షేత్ర సహాయకులను సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలి. పొలం విస్తీర్ణం బట్టి పంట కుంట నిర్మాణాన్ని అంచనా వేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

తాజా మార్గదర్శకాల ప్రకారం రైతు పొలంలో పంట కుంటలు నిర్మించుకునేందుకు అవకాశం ఉంది. వర్షాల కాలంలో నీరు నిల్వ చేసుకుని వేసవిలో వాడుకునేలా రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి పంచాయతీకి 10 నీటి కుంటలు మంజూరయ్యాయి. **- శ్రీధర్‌రెడ్డి, ఏపీవో, ఎన్పీకుంట**